సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం : 10 : జూలై : 2024



పాఠశాలలకు అండగా..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా ఉంటామని సినీ నటి మంచులక్ష్మి అన్నారు.

వివరాలు 8లో ▸



గద్వాలను దోచుకున్నారు

పదేళ్లలో గద్వాల ప్రాంతాన్ని దోచుకున్నారని ఎంపీ డీకే అరుణ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /23.2

రోజులో ఎక్కువ శాతం ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎరువులు కొనుగోలు చేస్తే రసీదులు ఇవ్వాలి



పెద్దకొత్తపల్లి: ఎరువుల దుకాణాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లి, సాతాపూర్ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఎరువుల దుకాణం యజమానులు స్టాక్ నిల్వలు, ధరల పట్టికలను నిర్వహించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులను, పురుగు మందులను అమ్మవద్దని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ రవి కుమార్, ఏఈఓలు ముజీబ్, లథీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

కొల్లాపూర్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం మొలచింతలపల్లికి రానున్నారు. ఇటీవల దాడికి గురైన చెంచు ఈశ్వరమ్మ కుటుంబాన్ని ఆయన కలవనున్నారు. దాడి ఘటనతో పాటు, చెంచుల సమస్యలను తెలుసుకోనున్నారు. మధ్యాహ్నం 12.30కు ఆయన మొలచింతలపల్లి చేరుకొని చెంచులతో మాట్లాడిన అనంతరం ప్రభుత్వ అధికారులతో కొల్లాపూర్‌లోని కేఎల్‌ఐ అతిథి గృహంలో సమావేశం కానున్నారు.

పబ్బతి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు



అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. మూడు నెలలకు సంబంధించిన మొత్తం హుండీ ఆదాయం రూ.41,88,753, మిశ్రమ వెండి ఐదుకిలోల 150 గ్రాములు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. లెక్కించిన మొత్తాన్ని పదర ఏపీజీవీబీలో భద్రపరిచారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈఓ రంగాచారి, ఆలయ అధికారులు జైపాల్‌రెడ్డి, నాగరాజు, అజయ్, జంగయ్య, ప్రధాన అర్చకులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో ప్రతి గురువారం ప్రజావేదిక

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ నుంచి అందించే సేవలపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే పరిష్కరించేందుకు గాను ప్రజావాణితో పాటుగా గురువారం పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రజావేదిక ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు. ప్రజలకు ఆయా కాలనీల్లోని అనేక సమస్యలపై ప్రజావాణి లేదా ప్రజావేదికలో ఫిర్యాదు చేసిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

‘దళితులపై వివక్ష తగదు’

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలో చట్టాలు అమలు చేసే పోలీసులు దళితులపై వివక్ష చూపుతున్నారని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. దళిత ఎస్‌ఐ శ్రీరాములశ్రీనివాస్ మరణించారని, ఆ మరణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ 25 రోజుల కిందటనే తాను ఎదుర్కొంటున్న వివక్ష, వేధింపులపై ఆ జిల్లా ఎస్పీకి లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా.. సరైన సమయంలో స్పందించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రోజురోజుకు దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో రాష్ట్ర పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

3 అంశాలు.. 4.22 గంటలు

అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ సమీక్ష



కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రాజెక్టులు, విద్య, వైద్యరంగాలపై చర్చ
- 18 నెలల్లో పీఆర్‌ఎల్‌ఐ మినహా అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తి కావాలి
- కోయిల్‌సాగర్ సామర్థ్యం పెంచేలా ప్రతిపాదనలు చేయాలి
- ‘భీమా’ ఆర్‌అండ్‌ఆర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- పునరావాస కల్పనలో ఎలాంటి జాప్యం చేయొద్దు..
- పాఠశాలల పరిశుభ్రత బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలకు..
  ఫైలెట్ ప్రాజెక్ట్‌గా మహబూబ్‌నగర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశం సుదీర్ఘంగా సాగింది. మధ్యాహ్నం 1.48 గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. సాయంత్రం 6.10 గంటలకు ముగిసింది. 4.22 గంటల పాటు సాగిన సమీక్షలో ఉమ్మడి జిల్లాకు చెందిన తాగు, సాగునీటి ప్రాజెక్ట్‌ల స్థితిగతులు, విద్య, వైద్య సదుపాయాలు చర్చకు వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి పాలమూరుకు చెందిన ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కాగా.. ముఖ్యమంత్రి ప్రతి అంశంపై పూర్తి స్థాయిలో ఆరా తీయడంతో పాటు పలు సూచనలు చేశారు. ప్రధానంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ప్రాజెక్ట్‌లపై చర్చించారు. భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను 18 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భీమా ప్రాజెక్ట్‌పై..

రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్‌పై సమీక్షిస్తూ కానాయిపల్లి ఆర్‌అండ్‌ఆర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని రేవంత్ సూచించారు. అవసరమైతే గ్రామసభ నిర్వహించి రీ సర్వే చేపట్టాలన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి పునరావాస కల్పనలో ఏ మాత్రం జాప్యం చేయొద్దని అధికారులకు సూచించాలన్నారు.

కోయిల్‌సాగర్ ప్రాజెక్టుపై..

ఆర్‌అండ్‌ఆర్ సమస్య లేకుండా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ రిజర్వాయర్ సామర్థ్యం పెంపుపై పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం డిజైన్ చేసిన ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేలా స్పష్టమైన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కోయిల్‌సాగర్ కింద నీటి లభ్యత ఆధారంగా హాజిలాపూర్, చౌదర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. డిసెంబర్ 2025 నాటికి కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఇంజినీర్లు హామీ ఇచ్చారు.



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరూ కృషి చేయాలని సీఎం సూచించారు. గ్రామాల్లో పిల్లలను బడికి తీసుకొచ్చే బాధ్యతను మహిళా సంఘాలు చూసుకోవాలన్నారు. పాఠశాలల పరిశుభ్రత బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించాలని, ఈ విధానాన్ని మహబూబ్‌నగర్‌లో పైలట్ పద్ధతిన అమలు చేయాలన్నారు. మంచి ఫలితాలు వస్తే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్య, వైద్యంపై..

అన్ని మండలాల్లో వైద్యారోగ్య కేంద్రాలు, అసెంబ్లీ నియోజకవర్గంలో ఏరియా ఆస్పత్రులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గకేంద్రంలో ఉన్న ఆస్పత్రులు, నర్సింగ్ కళాశాలలకు సంబంధించిన వివరాలు సమర్పించాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్, షాద్‌నగర్, వనపర్తి ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, తూడి మేఘారెడ్డితో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలో ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు రాహుల్ బొజ్జా, బుర్ర వెంకటేశం, ఆర్‌వీ కన్నన్, ప్రశాంత్ జీవన్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు తయారు చేసిన వస్తువులు పరిశీలిస్తున్న సీఎం రేవంత్, కలెక్టర్ విజయేందిర

ఎవరెవరు ఏం మాట్లాడారంటే..

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద తర్నికల్ వైపు ఒక లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం వారీగా రిజర్వాయర్లు నిర్మించాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను మంజూరు చేస్తే త్వరగా పూర్తవుతాయన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ర్యాలంపాడు కింద స్టేజ్ వన్ గూడెందొడ్డి ఎత్తిపోతలకు సంబంధించి 10 టీఎంసీల రిజర్వాయర్ పటిష్టం చేయాలన్నారు. దీని ద్వారా గట్టు లిఫ్ట్ ఇరిగేషన్‌ను నాలుగు టీఎంసీలకు చేసుకోవచ్చని సూచించారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ మాట్లాడుతూ నెట్టెంపాడు కింద వల్లూరు, మల్లమ్మకుంట, జూలకల్లు రిజర్వాయర్లు నిర్మిస్తే అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. వీరితో పాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, జడ్చర్ల ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు విజయభాస్కర్ రెడ్డి, రమణారెడ్డి ప్రాజెక్టుల వారీగా వివరాలు సమర్పించారు. విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా మహబూబ్‌నగర్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు.

మహబూబ్‌నగర్‌కు రూ.45 కోట్లు..

మహబూబ్‌నగర్ పట్టణంలో అంబేడ్కర్ కళాభవన్ సమీపంలో రూ.15 కోట్ల వ్యయంతో ఉర్దూ ఘర్, రూ.25 కోట్ల వ్యయంతో కొత్త షాదీఖానా, మౌలాలిగుట్ట వద్ద రూ.5 కోట్ల వ్యయంతో ముస్లిం గ్రేవీ యార్డ్ మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

మహాగని మొక్క నాటిన సీఎం

సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర అబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం రేవంత్ మహాగని మొక్క నాటి నీరు పోశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 3,680 మహిళా సంఘాల గ్రూపులకు రుణాల కింద రూ.334.02 కోట్ల చెక్కును అందజేశారు.

జాబ్ క్యాలెండర్ ప్రకారమే పోస్టుల భర్తీ

జాబ్ క్యాలెండర్ ప్రకారం పోస్టులను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడారు. జూన్ 2 నాటికి రాష్ట్రంలో ఏయే జిల్లాలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో తెప్పించుకున్నామన్నారు. డిసెంబర్ నాటికి ఖాళీలను భర్తీ చేస్తామని..డిసెంబర్ 9న నాటికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చేలా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ పనులు, చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ అనంతరం డీసీసీ అధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియ ఉంటుందన్నారు. పార్టీలో పనిచేసే వారికే సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వివిధ కారణాలతో ఎమ్మెల్యే టికెట్ రాని వారికి, పార్టీ కోసం శ్రమించిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవులను కేటాయించినట్లు గుర్తు చేశారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌లో అల్పాహారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి తదితరులు

పాలమూరుకు జూరాల నుంచి నీరు తీసుకోవాలి..



ప్రాజెక్ట్‌ల కింద భూసేకరణ చెల్లింపులను తక్షణమే చేయాలి. గతంలో పూర్తయిన ప్రాజెక్టులకు సైతం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. నెట్టెంపాడు 19వ ప్యాకేజీ ఇంకా పూర్తి కాలేదు. జూరాల నుంచి పాలమూరు–రంగారెడ్డికి నీరు తీసుకుంటేనే పీఆర్‌ఎల్‌ఐ పథకం పూర్తవుతుంది. దీనిపై ఒకసారి ఆలోచించాలి. నారాయణపేటలో టెక్స్‌టైల్ పార్కు, గద్వాలలో హ్యాండ్లూమ్ పార్కు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

– డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ



కలెక్టరేట్ ఆవరణలో మహాగని మొక్క నాటి నీరు పోస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇలా..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో రూ.396.06 కోట్ల వ్యయంతో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

■ కలెక్టరేట్‌లో హన్వాడ మండలం విజయలక్ష్మి మహిళా సంఘం రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన భక్ష్యాలు, లడ్డు తిని బాగుందని కితాబిచ్చారు. ■ పాలమూరు యూనివర్సిటీలో రూ.42.40 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.13.44 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ■ ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.10 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన.. ■ దేవరకద్రలో రూ.6.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన.. ■ మహబూబ్‌నగర్ రూరల్ లో రూ.3.25 కోట్లతో, గండేడ్‌లో రూ.6.20 కోట్లతో కేజీబీవీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన. ■ పాలమూరు యూనివర్సిటీలో రూ.13.44 కోట్లతో ఎస్టీపీ, అకాడమిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు శంకుస్థాపన. ■ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.37.87 కోట్లతో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్, రూ.276.80 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.



సీఎం ఆవిష్కరించిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు

పేదలకు విద్యను అందించడమే లక్ష్యం



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని ఈ విద్యాసంవత్సరంలోగా నిర్మిస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు మంగళవారం ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో దాదాపు 500 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని చెప్పారు. వారికి మెరుగైన సౌకర్యంతో నూతన భవనాన్ని నిర్మించనున్నామని, అతి త్వరలో ప్రారంభిస్తామన్నారు. కళాశాలలో అధ్యాపకుల బోధనపై నమ్మకంతో, విశ్వాసంతో ఎంతో మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని, వారికి ఎంసెట్ ఇతర ఉన్నత విద్యకు ఉత్తమ బోధన చేస్తున్నారని అధ్యాపకులను అభినందించారు. జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అనసూయ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్, కొత్త శ్రీనివాసులు, నిజాం, నాయకులు కోటయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల సాధనకు పోరాటం

నాగర్‌కర్నూల్: విద్యార్థుల సమస్యలపై పోరాడే ఏకైక పరిషత్ ఏబీవీపీ అని పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక విశ్వవికాస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం 76వ జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 1949 జూలై 9న ప్రారంభమై ఆనాటి నుంచి విద్యార్థులకు జాతీయ భావాలు నేర్పుతూ.. జాతీయ పునర్నిర్మాణం కోసం పరితపిస్తున్న ఏకైక సంఘం ఏబీవీపీ మాత్రమే అన్నారు. ‘నేషన్ ఫస్ట్ సెల్ఫ్ నెక్స్ట్’ అనే స్లోగన్‌తో ముందుకు వెళ్తూ.. ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ.. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుతుందన్నారు. అలాగే విద్యార్థి శక్తి జాతీయ శక్తి అనే భావనతో ముందుకు సాగుతున్నా విద్యార్థి సంఘం ఏబీవీపీ అని అన్నారు.

జూరాలకు తగ్గిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద మంగళవారం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం 2,051 క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 583 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. ప్రాజెక్టు నుంచి 132 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నా మని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.740 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడుకు నిలకడగా..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నీటిమట్టం నిలకడగా ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా నీటి సరఫరా లేదని, తాగునీటి అవసరాలకు రోజుకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని చెప్పారు.

క్లుప్తంగా

భర్తను హతమార్చిన భార్యకు యావజ్జీవ శిక్ష

మరికల్: భర్తను హతమార్చిన భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పెద్దచింతకుంటకు చెందిన మరాఠి శ్రీనివాసులు (35) 2022, డిసెంబర్ 7న ఇంట్లో అనుమానాస్పదంగా మృతిచెందాడు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో శ్రీనివాసులు తండ్రి మరాఠి పరమేశ్వర్ కోడలు సుజాతపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ అశోక్‌బాబు సుజాతను విచారించగా.. తను ప్రియుడి సాయంతో మద్యం మత్తులో నిద్రిస్తున్న శ్రీనివాసులు ముఖంపై దిండు పెట్టి హత్య చేసినట్లు ఒప్పుకుంది. మంగళవారం సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళి, కోర్టు లైజనింగ్ అధికారి శంకరయ్య, కోర్టు డ్యూటీ అధికారులు బాల ఈరప్ప, శ్రీధర్, హన్మంతు సాక్షులను నారాయణపేట కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజాతకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు. కేసు విచారణలో బాగా పనిచేసిన పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను డీఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

వనపర్తి ఆర్‌అండ్‌బీ డీఈఈ మృతి


దానయ్య (ఫైల్)

వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా రోడ్లు, భవనాలశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.దానయ్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌కు చెందిన దానయ్య 2007లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా జిల్లాకేంద్రంలో విధుల్లో చేరగా.. 2019లో డీఈఈగా పదోన్నతి లభించింది. ఏడాది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గత నెల 6న సమస్య తీవ్రం కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. దానయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జిల్లాకేంద్రంలో రహదారుల విస్తరణ, ఇతర నిర్మాణాల్లో దానయ్య కీలక పాత్ర పోషించారు. అనేక పర్యాయాలు ఉత్తమ అధికారిగా ప్రశంసలు అందుకున్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయంలో దానయ్య చిత్రపటాన్ని ఏర్పాటుచేసి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. దానయ్య మృతి పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మెట్లు దిగుతూ జారిపడి భవన కార్మికుడు..

అమరచింత: నూతన భవనంలో మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన ఉప్పరి కర్రెన్న(65) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక జగన్‌వాడలో తాటికొండ రమేష్‌కు చెందిన ఇంటి నిర్మాణ పనులు చేపట్టగా తుది దశకు చేరాయి. అయితే మేస్త్రీ రామకృష్ణ కోరిక మేరకు మంగళవారం దావత్ ఏర్పాటు చేసుకున్నారు. భోజనంలో పాల్గొన్న కర్రెన్న భవనంపై నుంచి కిందకు దిగుతూ మెట్లు జారడంతో కిందపడి గాయపడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలించే లోపు మృతిచెందాడు.

లాభదాయక పంటలపై దృష్టి సారించాలి


వీసీలో పాల్గొన్న డీఏఓ గోవింద్ నాయక్, రైతులు

మల్దకల్: తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం మల్దకల్ రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో పాటు డీఏఓ పాల్గొన్నారు. ఈసందర్భంగా పంటల సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ముఖ్యంగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలని.. తద్వారా భూమి సారవంతంగా ఉంటుందన్నారు. పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీతలక్ష్మి, ఏఓ రాజశేఖర్, ఏఈఓలు పాల్గొన్నారు.

పదేళ్లుగా గద్వాలను దోచుకున్నారు

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల: నడిగడ్డలో ఉన్న ప్రస్తుత ప్రజాప్రతినిధులు, నాయకులు పదవులు, కుర్చీల కోసం ఆరాట పడుతున్నారని.. వారికి అభివృద్ధి, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని డీకే అరుణ అన్నారు. గద్వాలలో విజయోత్సవ ర్యాలీ అనంతరం మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి ఆమె మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్లు నడిగడ్డ వెనుకబాటుకు గురైందన్నారు. ఈ ప్రాంత నాయకులకు అభివృద్ధి కంటే స్వప్రయోజనాలు ముఖ్యమయ్యాయని దుయ్యబట్టారు. పదేళ్లుగా గద్వాల ప్రాంతం దోపిడీకి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన ఓటమికి సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వాదాన్ని నెత్తినెత్తుకుని ఊరూరా తిరిగి ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు బీసీ వాదాన్నే విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఆయన కుట్రలను ప్రజలు నమ్మలేదన్నారు. గద్వాలలో ఎన్నికల ముందు ఒకరు, ప్రస్తుతం మరొకరు బీఆర్‌ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లో చేరారని.. ఇప్పుడు ఆ రెండు పార్టీలు ఒకటే అయ్యాని ఎద్దేవా చేశారు. ఎన్నికల స్టంట్‌గా హడావిడిగా ప్రభుత్వ మెడికల్ కళాశాల జీవో ఇచ్చి గొప్పలు చెప్పుకున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కావల్సిన అనుమతులు రాలేదన్నారు. గత ఎన్నికల్లో మోసపూరితమైన వాగ్దానాలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు పోరాటం సాగిస్తామన్నారు. మాజీ ఎంపీ రాములు, బీజేపీ నాయకులు భరత్‌ప్రసాద్, రామచంద్రారెడ్డి, అప్సర్‌పాష, బండలపద్మావతి, కృష్ణవేణి, జయశ్రీ, శివారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవ్‌భరద్వాజ్ పాల్గొన్నారు.


గద్వాలలో విజయోత్సవ ర్యాలీలో బీజేపీ శ్రేణులు

డీకే అరుణకు ఘనస్వాగతం

అంతకుముందుకు ఎంపీగా ఎన్నికైన తర్వాత మొదటిసారి గద్వాలకు వచ్చిన డీకే అరుణకు జిల్లాకేంద్రంలో ఘనస్వాగతం లభించింది. మంగళవారం హైదరాబాద్ నుంచి వాహన కాన్వాయ్‌తో వచ్చిన ఆమెకు నడిగడ్డ జమ్ములమ్మ ఆలయ ముఖ ప్రాంగణం నుంచి పూల మాలలతో కార్యకర్తలు స్వాగతం పలికారు. గద్వాల పట్టణంలో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఫ్లైఓవర్, రాజీవ్‌మార్గ్ రోడ్డు, పాతబస్టాండ్, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, కిష్టారెడ్డిబంగ్లా, గాంధీచౌరస్తా వరకు దారిపొడువునా కాషాయ జెండాలు రెపరెపలాడాయి. ఓపెన్‌టాప్ వాహనంలో నిలబడి డీకే అరుణ ఇరువైపులా ఉన్న జనాలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ప్రధాన చౌరస్తాల్లో కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కౌన్సిలర్ త్యాగరాజు వేర్వేరుగా భారీ గజమాలలతో స్వాగతం పలికి అభిమానం చాటుకున్నారు. అనంతరం ఎంపీ డీకే అరుణ జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ప్రభుత్వ బడులకు అండగా టీచ్ ఫర్ చేంజ్

- ప్రైవేటుకు ధీటుగా సర్కారు స్కూళ్లు మారుస్తాం
- మూడేళ్లు దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తాం: సినీనటి మంచు లక్ష్మి


స్మార్ట్ క్లాస్ రూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మంచులక్ష్మి

నారాయణపేట/ నారాయణపేట రూరల్: తన తాత, నాన్న స్ఫూర్తితో విద్యా రంగానికి సేవ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలబడుతున్నామని ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. వేణీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'టీచ్ ఫర్ చేంజ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, సంస్థ నిర్వాహకులు రత్నారెడ్డితో కలిసి నారాయణపేట జిల్లా కొల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూంను ప్రారంభించి, జెడ్పీ పాఠశాలలో విద్యార్థినులకు హైజెనిక్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తాత ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎంగా పనిచేయడంతోపాటు తండ్రి మోహన్‌బాబు విద్యానికేతన్ పేరు తో పాఠశాలను ప్రారంభించి గత 30 ఏళ్లు గా 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన చేస్తున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని విద్యారంగంలో తనవంతు సహకారం అందించాలని గత పదేళ్లుగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించి మూడేళ్లపాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తూ.. టీచర్లకు అవసరమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆయా తరగతులకు బేస్‌లైన్ మిడ్‌లైన్, ఎండ్‌లైన్ టెస్టుల నిర్వహణతోపాటు తాము దత్తత తీసుకోక ముందు.. తర్వాత ఎలా ఉందో బేరీజు వేస్తామన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే..

వాస్తవానికి ఈ ఏడాది నారాయణపేట నియోజకవర్గం ఎంపిక చేసుకోవడానికి ఇక్కడి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కారణమని వేణీరావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు రత్నారెడ్డి తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో చిరాగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన తన దగ్గర చిట్టెం పర్ణికారెడ్డి చదువుకుందని, తన ప్రియ శిష్యురాలు కావడం, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే ఆమెను అభినందించి సేవా కార్యక్రమాలకు తన నియోజకవర్గంలో అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. దీంతో ఆమె సహకారంతో నియోజకవర్గంలో 16 పాఠశాలలను దత్తత తీసుకుని స్మార్ట్ క్లాస్‌ల ఏర్పాటుతోపాటు దాదాపు 6 వేల మంది విద్యార్థినులకు హైజెనిక్ ప్యాడ్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

బోధనలో మార్పులకు శ్రీకారం

ప్రభుత్వం ఎన్నో రకాల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా వాటికి తోడుగా ప్రైవేటుకు ధీటుగా బోధనలో మార్పులకు టీచ్ ఫర్ చేంజ్ సహకరిస్తుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చెప్పారు. టీచర్లు సైతం అందుకు అనుగుణంగా పిల్లలకు తగినట్లు బోధన చేయాలన్నారు. అమ్మాయిలు రుతుక్రమ సమయంలో పాఠశాలలకు గైర్హాజరు కాకుండా తల్లిదండ్రులు చైతన్యవంతమై, సంస్థ ద్వారా అందిస్తున్న రీ వాషబుల్ హైజెనిక్ ప్యాడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత.. ముందు విద్య, వైద్యంతోపాటు రైతులకు అవసరమైన సాగు, తాగునీటిపైనే దృష్టిసారించినట్లు వివరించారు. కార్యక్రమలలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని, ఏఎంఓ విద్యాసాగర్, ఎంఈఓ గోపాల్‌నాయక్, డీఎస్‌ఓ భానుప్రకాష్, జీహెచ్‌ఎం అనురాధ, పీఎస్ హెచ్‌ఎం భీమేశ్వరి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, కవిత, రవికుమార్, బాలరాజు, శ్రీహరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ హోమాలు


సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలో శ్రీకృష్ణ కాలచక్రం, అయుత చండీ, అతిరుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మూడోరోజు మంగళవారం ఉదయం గోపూజ, యాగశాల ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఈసందర్భంగా మాట్లాడారు. కార్యసిద్ధి, బుద్ధిబలం, ధైర్యం సిద్ధించేందుకు హనుమంతుడి కటాక్షం అవసరమన్నారు. ఈ మేరకు భక్తులు విశేషంగా మన్యు సూక్త హనుమత్ హోమాలు నిర్వహించారని తెలిపారు. జన్మరీత్యా, గోచార రీత్యా ఉన్న సర్పదోష నివారణ, త్వరితగతిన వివాహాలు జరిగేందుకు వర పశుపత, కన్యా పశుపత హోమాలు శాస్త్రోక్తంగా విడివిడిగా నిర్వహించినట్లు వివరించారు. వేద బ్రాహ్మణులచే సుబ్రహ్మణ్యస్వామి హోమాలు సామూహికంగా చేపట్టినట్లు తెలిపారు. రుత్వికులచే చండీ, రుద్ర, రామాయణ, భాగవత, సుందరకాండ, చతుర్వేద హోమాలు కొనసాగాయి. అదేవిధంగా పుత్ర కామేష్టి హోమాలు చేపట్టారు. ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన, సింధూర అర్చన వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వేడుకలకు తరలివచ్చారు. భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులచే సామూహిక భజనలు, మహిళా భక్తులతో కుంకుమార్చన నిర్వహించారు. నాల్గో రోజు బుధవారం గణపతి సహిత అష్టగణపతి హోమాలు, సాయంత్రం లక్ష గరికార్చన, శ్రీ బుద్ధి సిద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.


హనుమత్ హోమాల్లో పాల్గొన్న భక్తులు

పాలమూరు అభివృద్ధికి పునాది వేస్తాం


మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, నారాయణరెడ్డి

- కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు
- స్థానిక సంస్థల్లో గెలిపించే బాధ్యత ఎమ్మెల్యేలదే..
- పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి


సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు అభివృద్ధి కోసం పునాదులు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రం భూత్పూర్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం పాల్గొని మాట్లాడారు. మనం కష్టపడి ఇక్కడి నుంచి ఎంపీగా కేసీఆర్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్యాయం చేసి, ఎండబెట్టిండు.. కేసీఆర్‌ను ఓడించాలని, కాంగ్రెస్‌ను గెలిపించాలని కార్యకర్తలు కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చారు. ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా నాకు గొప్ప అవకాశం వచ్చింది. ఈ జిల్లాలో అభివృద్ధి జరగాలి, పంటలు పండాలి, పరిశ్రమలు, మన బిడ్డలకు వైద్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రాజెక్టులన్నింటినీ త్వరలోనే పూర్తి చేయాలని, నిధులు విడుదల చేస్తామని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

కార్యకర్తల వల్లే అధికారంలోకి..

కార్యకర్తలను కలుసుకోవడానికి ఈ సమావేశం నిర్వహించినట్లు సీఎం తెలిపారు. నేను నాయకుడిగా కంటే.. కార్యకర్తగా ఉండడమే సంతోషమని పేర్కొన్నారు. ఈ గెలుపు, అధికారం మీలాంటి కార్యకర్తల కష్టం వల్లే వచ్చిందన్నారు. మీరందరూ కష్టపడినందుకే ఉమ్మడి జిల్లాలో 14కు 12 ఎమ్మెల్యేలను గెలుచుకున్నామని పేర్కొన్నారు. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించబోతున్నామని.. ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి కార్యకర్తలను సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత తీసుకుంటారని చెప్పారు. దేవాలయాలు, మార్కెట్ కమిటీ, గ్రంథాలయాలు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో కష్టపడి పడిన కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేలకు సూచించానన్నారు. 2021 జూలై 7న నేను టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకొని మూడేళ్లు పూర్తయింది. ఈ కాలంలో కార్యకర్తలకు నాకు అండగా నిలిచి కేసీఆర్‌పై పోరాటం చేశారన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయినప్పుడు రేవంత్‌రెడ్డి పని అయిపోయిందని కొంతమంది శునకానందం పొందారని.. కానీ, కార్యకర్తల కష్టం వల్ల ఈ రోజు 65 మంది ఎమ్మెల్యేలు, 8 ఎంపీలను గెలిపించుకున్నామన్నారు. ఇటీవలే ఇచ్చిన 35 కార్పొరేషన్ చైర్మన్లలో ఒక్క పైరవీకారుకు అవకాశం ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారికే కట్టబెట్టామన్నారు.

అత్యున్నత స్థాయికి..

70 ఏళ్ల తర్వాత మన జిల్లా బిడ్డ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, ఈ జిల్లాను అభివృద్ధిలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్తారనే నమ్మకం ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా జిల్లా నుంచే సమీక్షా సమావేశాలు ప్రారంభించడం జరిగిందన్నారు. గత పాలకులు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగా ఉన్నాయని, వీటన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి సీఎం కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. విద్యారంగంలో అందరికీ నాణ్యమైన విద్య అందించడానికి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. రాష్ట్రానికి మన బిడ్డ సీఎంగా ఉన్నందున జిల్లా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. పాలమూరుకు స్వర్ణయుగం రానుందన్నారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు మన్నె జీవన్‌రెడ్డి, వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతుండగా రూ.లక్ష చోరీ


సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ మురళి

మరికల్: పట్టణంలోని బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా ఓ వ్యక్తి జేబులో నుంచి రూ.లక్ష ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మురళి కథనం మేరకు.. మండలంలోని అప్పంపల్లికి చెందిన నర్సిరెడ్డి మామ బసిరెడ్డి కడుపు నొప్పితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో నర్సిరెడ్డి రూ.లక్ష జేబులో పెట్టుకొని మరికల్ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కారు. లోనికి వెళ్లాక చూసుకోగా జేబులో డబ్బులు కనిపించ లేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు స్టేషన్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అతడి వెంట ఎక్కిన నలుగురు యువకులు, ఇద్దరు అమ్మాయిలు డబ్బులు కొట్టేసి ఒకరి నుంచి ఒకరికి చేతులు మారినట్లు కనిపించింది. మూడో యువకుడు బ్యాగులో డబ్బులు పెట్టుకొని అక్కడి నుంచి జారుకున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కాళ్లపారాణి ఆరక ముందే..

- రోడ్డు ప్రమాదంలో నవ వరుడు దుర్మరణం.. వధువు కోమాలోకి
- మరో చిన్నారికి తీవ్రగాయాలు
- మక్తల్ మండలం ముష్టిపల్లిలో విషాదం


వెంకటేష్ - విజ్జమ్మ (ఫైల్)

మక్తల్: కొత్త ఆశలతో భవిష్యత్‌ను ఊహించుకుంటూ.. వారం రోజుల కిందట వైభవంగా వివాహం చేసుకున్న నవజంట కాళ్లపారాణి ఆరకముందే రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈఘటనలో వరుడు దుర్మరణం చెందగా.. వధువుకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లింది. నవ జంటతో పాటు ఉన్న ఓ చిన్నారికి సైతం తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్ మండలం ముష్టిపల్లికి చెందిన పెద్ద చెన్నప్ప - జయమ్మ రెండో కుమారుడు వెంకటేష్ అలియాస్ చందు (25), కర్ణాటక రాష్ట్రం బాల్చేడ్‌కు చెందిన విజ్జమ్మతో ఈనెల 1వ తేదీన మక్తల్ పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. రెండు రోజుల కిందట నవ జంటకు వారం నీళ్లు పోసేందుకు గాను వధువు కుటుంబ సభ్యులు బాల్చేడ్ గ్రామానికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి సోమవారం మధ్యాహ్నం నవ వధూవరులు ఓ చిన్నారితో పాటు బంధువుల స్వగ్రామమైన బల్చక్రానికి బైక్‌పై వెళ్తుండగా.. సైదాపూర్ చౌరస్తాలో అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. నవ వధువు విజ్జమ్మతో పాటు చిన్నారి రేణుకకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం రాయచూర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విజ్జమ్మ కోమాలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంకటేష్ కుటుంబ సభ్యులు సైదాపూర్‌కు చేరుకొని బోరున విలపించారు. వారి ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేష్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం ముష్టిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. పెళ్లి జరిగిన వారం రోజుల్లోనే నవ వరుడు మృతిచెందడం.. వధువు కోమాలోకి వెళ్లడంతో ముష్టిపల్లిలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

బీసీలను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతాం

- బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్


మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలను అణగదొక్కాలని చూస్తున్న కాంగ్రెస్‌పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ సమాజం సిద్ధంగా ఉందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ పదవులు, మంత్రిమండలి, నామినేటెడ్ పదవులు, పదోన్నతులు ఇలా ప్రతి విషయంలో బీసీలను విస్మరించి తీవ్ర అన్యాయానికి గురి చేస్తోందని తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని పార్టీలోకి తీసుకొని బీసీ బిడ్డ సరిత తిరుపతయ్యను అన్యాయానికి గురిచేశారని ఆరోపించారు. మంత్రి పదవి రేసులో ఉన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై రెండ్రోజులుగా సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు సృష్టించి ఇబ్బందులు కలిగించే విధంగా అగ్రవర్ణ నాయకులు తెరవెనుక కుట్ర చేస్తున్నారన్నారు. దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ నాయకుడు ప్రదీప్‌కుమార్‌గౌడ్ అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరి, పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారని.. ఈ రోజు వరకు సముచిత స్థానం కల్పించకపోవడం వెనుక ఉన్న అగ్రవర్ణ కుట్రలను ఖండించారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నందున బీసీలంతా సంఘటితంగా ఉండాలన్నారు. భవిష్యత్‌లో పునరావృతం అయితే బీసీల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకోవాల్సి వస్తోందన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ కో-కన్వీనర్ సవారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన మహిళ

నాగర్‌కర్నూల్ క్రైం: కూలీ పనులకు వెళ్లగా.. దాడిచేశారని ఓ మహిళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. అందుకు సంబంధించి బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన గడ్డం సుజాత ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని నాగనూలు రోడ్డులో ప్లాట్ వద్ద కూలీ పనులకు వెళ్లింది. అక్కడ ప్లాట్‌లో వివాదం కొనసాగుతుండగా.. ఓ వర్గం వారు వచ్చి కూలీ పనికి వచ్చిన గడ్డం సుజాతపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు స్పందించకపోవడంతో ఆమె మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.